ప్రజాశక్తి
శనివారం 29 ఏప్రిల్ 2023
5
అనంతపురం



13న లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం


కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడుతున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మే 13న నిర్వహించనున్న లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరుతూ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్లు ఎమ్.గౌతమి, అరుణ్ బాబు, ఎస్పీలు కంచి శ్రీనివాసరావు, ఎస్‌వి.మాధవ్ రెడ్డి తదితరులతో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.శ్రీనివాస్ శుక్రవారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అండర్ ట్రయల్స్‌గా ఉంటూ జైళ్లలో ఉంటున్న బాధితుల కేసులకు సంబంధించిన ఛార్జిషీటు త్వరగా ఫైల్ చేయాలని ఎస్పీలను కోరారు. ఈ సమావేశంలో అత్యాచారానికి గురైన ఓ బాధితురాలికి పరిహారంగా రూ.7 లక్షలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు.


చిరుధాన్యాలతో తయారు చేసిన వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

చిరుధాన్యాలతో ఆరోగ్యం

కలెక్టర్ ఎమ్.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమైన పోషకాలు అందించే సిరి ధాన్యాలు చిరుధాన్యాలు అని కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. శుక్రవారం నాడు పంగల్ రోడ్డు వద్దనున్న టీటీడీసీలో మిల్లెట్ మహోత్సవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశం చిరుధాన్యాల పుట్టినిల్లు అన్నారు. చిరుధాన్యాలకు ప్రజలు దూరం కావడం వల్ల ప్రతి పదిమందిలో నలుగురు బీపీ, షుగర్‌లతో బాధపడే పరిస్థితి వచ్చిందన్నారు. గతంలో కంటే ఎక్కువగా రక్తహీనత నేడు మహిళల్లో కనిపిస్తోందని చెప్పారు. ఈ సమస్యలకు చిరుధాన్యాలే పరిష్కారమన్నారు. ప్రజలు వారంలో ఒకరోజు 'మిల్లెట్ డే'గా కేటాయించుకుని కేవలం చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను మాత్రమే తినడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మిల్లెట్ మహోత్సవ్‌లోని స్టాళ్లలో చిరుధాన్యాలతో చేసిన ఆహారపదార్థాలను పరిశీలించారు. మూడున్నర ఎకరాల్లో 8 క్వింటాళ్ల అండుకొర్రలు పండించిన రైతు రాజశేఖర్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, డీపీఎం లక్ష్మా నాయక్, ఎల్డీఎం నాగరాజ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజ రావు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, శాస్త్రవేత్తలు సహదేవ రెడ్డి, పద్మలత పాల్గొన్నారు.




మే రెండో వారంలో మెగా గృహ ప్రవేశాలు

మే రెండవ వారంలో జిల్లా వ్యాప్తంగా నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి మెగా గహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులకు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో హౌసింగ్ అంశంపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యం మేరకు మెగా గహ ప్రవేశ కార్యక్రమానికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో పలు కారణాల వల్ల గహప్రవేశ కార్యక్రమం వాయిదా పడిందన్నారు. ఈసారి ఆ అవకాశం లేకుండా పనులు వేగవంతం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ కేశవ నాయుడు, పంచాయతీ రాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, సీపీవో ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

శింగనమలలో పొలిటికల్ హీట్..!





- అటు టిడిపి... ఇటు వైసిపిలో ఆధిపత్యపోరు
- నేతల మధ్య కుదరని సఖ్యత
- చాపకింద నీరులా విస్తరిస్తున్న నేతల వైరం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పుడు శింగనమల నియోజకవర్గం రాజకీయ వేడిని రాజేస్తోంది. అటు ప్రతిపక్ష టిడిపిలో అంతర్గత కుమ్ములాటలు కొనసాగుతుండగా, ఇటు అధికార వైసిపిలోనూ గ్రపు తగాదాలు తారా స్థాయిలోనే నడుస్తున్నాయి. రెండు పార్టీల్లోనూ అంతర్గతపోరుకు కేంద్రంగా ఈ నియోజకవర్గం మారింది. మొన్నటి వరకు ప్రతిపక్ష టిడిపిలో ఎక్కువగా అసమ్మతి కనిపించేది. ప్రస్తుతం ఇది వైసిపికి పాకింది. బుధవారం నాడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన తరువాత అధికార పార్టీలో ఒక్కొక్కటిగా అసమ్మతి రాగాలు బయటకు వస్తున్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల ఎస్సీ రిజర్వు నియోజక వర్గంగా ఉన్నప్పటికీ ఒక బలమైన సామాజికవర్గ అధిపత్యం ఈ నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తుంది. ముందు నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ అదే తీరున రాజకీయాలుంటాయి. ప్రజాప్రతినిధిగా ఎస్సీ సామాజిక తరగతికి చెందిన వారున్నప్పటికీ ఆయా మండలాలు, గ్రామాల్లో పెత్తందారులదే పైచేయిగా ఉంటుంది. వారి కనుసన్నల్లోనే అక్కడి రాజకీయాలు నడుస్తూ ఉంటాయి. కాదంటే సదరు ప్రజాప్రతినిధికి సైతం తిప్పలు తప్పవు. ఈ క్రమంలో ఇప్పుడు ఎన్నికలు సమీస్తుండటంతో ఆయా పార్టీల్లో గ్రూపు తగాదాలు తీవ్ర స్థాయికే చేరుతుండటం గమనార్హం.

వైసిపిలో భగ్గుమంటున్న విభేదాలు

వైసిపిలో గ్రూపు తగాదాలు భగ్గుమంటున్నాయి. ఈ నియోజకవర్గంలో యల్లనూరు, పుట్లూరు మండలాలు ఫ్యాక్షన్ ప్రాంతాలుగా ప్రసిద్ధి చెందాయి. ఇక్కడి గ్రూపులకు ప్రాతినిధ్యం వహించే నాయకులు ఏ పార్టీలో ఉన్నా ఈ గ్రూపు తగాదాలు మాత్రం కొనసాగుతూనే ఉంటాయి. గతంలో కాంగ్రెసు పార్టీ ఉన్న సమయంలోనైనా ఇప్పుడు వైసిపిలోకి ఆ నాయకులొచ్చినా ఇదే తీరు కొనసాగుతోంది. యల్లనూరు మండలంలో శుక్రవారం నాడు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మరోవైపు వైసిపి నాయకులైన భోగాతి నారాయణరెడ్డి గ్రూపుల మధ్య వివాదం చెలరేగింది. తమ మద్దతుదారులను అన్యాయం చేస్తున్నారంటూ తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి పోలీసు స్టేషన్ వద్ద నిరసనకు దిగడం గమనార్హం. భోగాతి నారాయణరెడ్డికి ముఖ్యమంత్రి సలహాదారుగానున్న ఆలూరు సాంబశివారెడ్డి ముందు నుంచి మద్దతునిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. దీంతో అటు సాంబశివారెడ్డి, ఇటు కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య కూడా సఖ్యతలేదు. ఈ లేమి కారణంగానే అనంతపురం జిల్లాలోని నార్పలలో జరిగిన ముఖ్యమంత్రి పర్యటనకు సైతం పెద్దారెడ్డి హాజరవన్నట్టు ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి విమానాశ్రయంలో పెద్దారెడ్డి ముఖ్యమంత్రిని కలిసారు. కాని ఇక్కడ మాత్రం కార్యక్రమానికి హాజరవలేదు. ఈ విభేదాల కారణంగానే హాజరవనట్టు ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి పర్యటన ముగియకముందే చామలూరు రాజగోపాల్ ఎస్సీ సెల్ నాయకులు కూడా సాంబశివారెడ్డికి వ్యతిరేకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఎస్సీ సామాజికవర్గం నుంచి ఎదుగుతున్న తనను తొక్కేస్తున్నారని ఆరోపించారు. ఈ రకంగా అధికార పార్టీలో గ్రూపు రాజకీయాలు రోజురోజుకూ పెరుగుతూ పోతున్నాయి.

టిడిపిలోనూ ఇదే తీరు...

శింగనమల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలోనూ ఇదే రకమైన గ్రూపు తగాదాలు కొనసాగుతున్నాయి. ఈ గ్రూపు తగాదాలు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పర్యటన సమయంలోనూ స్పష్టంగా కనిపించాయి. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న బండారు శ్రావణి సమన్వయం చేయలేకున్నారని టుమెన్ కమిటీ పేరుతో ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడును ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ కమిటీకి, శ్రావణికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. పై ఇద్దరు ఓసి సామాజిక తరగతి కావడంతో ఇద్దరిలో ఎవరూ ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు వీల్లేని పరిస్థితి ఉంది. దీంతో ఎస్సీ రిజర్వు నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో ఎవరైతే మెరుగన్న దిశగా ఆ పార్టీ ఆలోచిస్తోంది. ముఖ్య నేతలు కూడా బలమైన వారిని ఈ నియోజకవర్గం బరిలో దింపేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్‌ను మాజీ ఎంపీ జెసి.దివాకర్‌రెడ్డి బుధవారం నాడు కలిసి మాట్లాడుకోవడం పెద్ద చర్చనీయాంశమే అయింది. ఇలా రెండు పార్టీల్లోనూ అంతర్గత పోరు తీవ్ర స్థాయిలో నడుస్తుండటం ఆ నియోజకవర్గంలో రాజకీయ వేడిని పెంచుతున్నాయి.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

ఎస్పీ శ్రీనివాసరావు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసు సిబ్బంది అందరూ వారి హోదాలను మరించి సమిష్టిగా పని చేయాలని ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. అనంతపురం పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని ఎస్ఐలు, ఆపైస్థాయి పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేవ్ కేసుల్లో తప్పనిసరిగా నిందితులకు శిక్షలు పడేలా చర్యలుండాలన్నారు. నేరం జరిగాక ఘటనా స్థల పరిశీలన, సాక్ష్యాధారాలు సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, ఛార్జిషీటు దాఖలు, కోర్టు ట్రయిల్స్ తదితరం అన్నీ పక్కాగా చేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్టుల ప్రయోగం, జిల్లా బహిష్కరణలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక ప్రాంతాల్లో చిన్న సమస్యలు సైతం తలెత్తకుండా అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. స్థలాలు, పొలాల విషయంలో పోలీసుల హద్దు మేరకు మాత్రమే పని చేయాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లను పూర్తి స్థాయిలో నియంత్రించాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులు స్వేచ్ఛగా వారి బాధలు చెప్పుకునే పరిస్థితులను కల్పించాలన్నారు. స్పందన అర్జీలపైనా దృష్టి సారించి నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఇదివరకే సాంకేతికతతో నడుస్తున్న కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, డీఎస్పీలు చైతన్య, నరసింగప్ప, బి.శ్రీనివాసులు, ఆంథోనప్ప, ఆర్ల శ్రీనివాసులు, ఎస్.ఎహబూబ్ బాషా, శ్రీనివాసులుతో పాటు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని చర్చి ప్రాంతంలో నాయకుల లింగమ్మ(70) భౌతిక కాయానికి శుక్రవారం రాయదుర్గం నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు బండికిష్టప్ప పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే మతురాలి కుటుంబ సభ్యులకు రూ. 5,100 అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కార్యదర్శి ఎన్.టి సిద్ధప్ప, ఉపాధ్యక్షుడు మలకన్న, పెన్నప్ప, పైగేరి హమాలీ యూనియన్ అధ్యక్షుడు గురుమాల్ శ్రీనివాసులు, భీమరాజు పాల్గొన్నారు.

బాలికలకు ఉన్నత విద్యనందించాలి


ప్రజాశక్తి-గుమ్మఘట్ట

తల్లిదండ్రులు పిల్లల పట్ల లింగ వివక్ష చూపవద్దని, మగ పిల్లలతో సమానంగా బాలికలను ఉన్నత విద్యకు పంపించాలని ప్రిన్సిపల్ శ్రీదేవి సూచించారు. స్థానిక జ్యోతిరావు పూలే హైస్కూల్‌లో శుక్రవారం ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో 'బడివైపు ఒక అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికెళ్లిన తర్వాత తల్లిదండ్రుల పట్ల గౌరవంగా ఉంటూ చదువుపై శ్రద్ధ కలిగి ఉండాలని సూచించారు. కౌమార, యవ్వనంలో ఉన్న పిల్లలు ఇంటి వద్ద జాగ్రత్తగా ఉండాలని, గ్రామానికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తెచ్చేలా నడవడిక ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఒత్తిడికి గురి చేయకుండా వారికి ఆసక్తి ఉన్న రంగంలో ప్రోత్సహించాలన్నారు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకోవడానికి 'బడివైపు ఒక అడుగు' చక్కని వేదిక అన్నారు. అనంతరం పాఠశాలకు రూ. 39 వేల విలువ చేసే సైన్స్ లైబ్రరీ పరికరాలు అందజేసిన సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్కూల్ కమిటీ మెంబర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


'బడి వైపు ఒక అడుగు' కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ శ్రీదేవి, తదితరులు

'ఉపాధి' కల్పించరూ..

కూలీల వేడుకోలు



ప్రజాశక్తి-బొమ్మనహాళ్

మండల పరిధిలోని మల్లనగుడ్డం, ఉంతకల్లు, లింగదహాల్, కష్ణాపురం, గోనెహాళ్, సిద్ధరాంపురం, కురవల్లి, నేముకల్ గ్రామాల్లో ఉపాధి, వ్యవసాయ పనులు లేక ప్రజలు వలస పోవడానికి సిద్ధమవుతున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో 300 నుంచి 400మంది కూలీలు ఉన్నారు. అయితే అధికారులు మార్చి అకౌంట్ సెక్షన్(ఆర్థిక సంవత్సరం ముగింపు) దష్టిలో ఉంచుకొని పనుల ఎస్టిమేషన్లు, వర్క్ ఆర్డర్లు ఇవ్వలేదు. అధికారుల ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే ఏప్రిల్, మే నెలల్లో ఉపాధి హామీ పనులు మంజూరు కాలేదని, దీనికి తోడు వ్యవసాయ పనులు లేక ప్రజలు వలస పోవాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు కొందరికి మాత్రమే ఉపాధి కల్పిస్తున్నారు. ఇకనైనా ఉపాధి హామీ పథకం జిల్లా అధికారులు స్పందించి పని దినాలు కల్పించాలని కోరుతున్నారు.

ఊసే లేని గ్రామ సభలు

ఉపాధి హామీ ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని, గ్రామాల్లో పనులను ఎంపిక చేయడానికి గ్రామ సభలు నిర్వహించడం లేదని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయ పనులకు అనుసంధానమైన చిన్న కాలువలు, వాగులు, గ్రావెల్ తొలగించడం, పొలాలకు పూడిక తరలించడం, తదితర కార్యక్రమాలు చేపడితే పలువురు రైతుల భూములు సాగులోకి వస్తాయని పేర్కొంటున్నారు. ఆయా అంశాలపై చిన్న సన్న కారు రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించినా వాటిపై స్పందించే వారే కరువయ్యారని వాపోతున్నారు. వంకలు, వాగులకు అడ్డుకట్టలు వేయడం, నీరు నిల్వ ఉండడానికి ఫార్మ్ పాండ్‌లు ఏర్పాటు చేయడం, తదితర పనులు కల్పించడం లేదని కూలీలు పేర్కొంటునారు.

ఎంపీడీఓ వివరణ: ఆయా విషయాలపై ఎంపీడీఓ షకీలా బేగంను వివరణ కోరగా త్వరలో అందరికీ పని కల్పిస్తామని తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న మౌనిక(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఇంటర్ పరీక్షల్లో తప్పానన్న మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపాల్టీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఒంటిమిద్ది గ్రామానికి చెందిన సునీత, వెంకటరెడ్డి దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. వీరిలో మౌనిక(17) పెద్దకూతురు. ఈమె అనంతపురం నారాయణ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం నాడు వెలువడిన ఫలితాల్లో గణితం సబ్జెక్టు ఈ విద్యార్థి ఫెయిల్ అయ్యింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి లోనైంది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో పాటు భోజనం చేసింది. అనంతరం నిద్రించేందుకు తన గదిలోకి వెళ్లింది. కొద్దిసేపటికే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం ఉదయం ఎంతసేపటికీ కుమార్తె గది నుంచి బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు లోపలికెళ్లి చూశారు. అప్పటికే కుమార్తె మంచంపై విగతజీవిగా కన్పించింది. కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తేజమూర్తి తెలిపారు.

అధికారం కోసం చంద్రబాబు పగటికలలు

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు


ప్రజాశక్తి-అనంతపురం

తెలుగుదేశం పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని చంద్రబాబు పగటి కలలు కంటున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటామిరెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం నగరంలోని 40వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఆయా లబ్ధిని తెలుసుకునేందుకు సుమారు ఏడాది కాలంగా గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో ప్రజల వద్దకు వెళ్తున్నామన్నారు. దీంతో జగన్ నాయకత్వం పట్ల ప్రజల్లో మరింత నమ్మకం పెరిగిందన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు తోడు సచివాలయ వ్యవస్థ పనితీరు బాగుందని ప్రజలు చెబుతున్నారన్నారు. జనం సంతోషంగా ఉంటే చంద్రబాబు మాత్రం బాధపడు తున్నాడన్నారు. 14 ఏళ్లు సిఎంగా పని చేసిన చంద్ర బాబు ప్రజల సంక్షేమం కోసం చేసిందేమీ లేదన్నా రు. అందుకే ఇప్పుడు ఎల్లో మీడియాను అడ్డుపెట్టు కుని ప్రభుత్వంపై, సీఎం జగన్‌పై లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారం రాదన్న ఫ్రస్టేషన్‌లో దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు ప్రజా సంక్షేమం పట్ల విజన్ లేదని, కేవలం అధికారంలోకి రావడం మాత్రమే ఆయన విజన్ అన్నారు. ఒంటరిగా పోటీ చేస్తే గెలవలేమని తెలిసి పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని దుయ్యబట్టారు. చరిత్రలో ఎవరూ చేయని విధంగా అన్నివర్గాలకూ న్యాయం చేసిన వ్యక్తిగా జగన్ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మొహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, చింతకుంట మధు, కార్పొరేషన్ల డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీనివాసులు, వైసీపీ బీసీ విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ రమేష్‌గౌడ్, వైసీపీ నాయకులు ఖాదర్, షరీఫ్, సందీప్, ఇసాక్, నల్లప్ప, గుజ్జల లక్ష్మణ్, గౌతమి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అసలు, వడ్డీ కట్టించుకోకుండా

పంట రుణాలు రెన్యువల్ చేయాలి

కెనరా బ్యాంకు మేనేజర్‌కు ఎపి రైతుసంఘం వినతి


బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అసలూ, వడ్డీ కట్టించుకోకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు పెంచి రెన్యువల్ చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కెనరా బ్యాంకు మేనేజర్‌కు ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువు జిల్లాలో రైతులు బ్యాంకు రుణాలు రెన్యువల్ చేయాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుల సమస్యలపై స్పందించి రైతుల రుణాలు రెన్యువల్ చేయాలని కెనరా బ్యాంక్ ఆర్ఎం, ఎల్‌డిఎంలను కలిసి విన్నవించినట్లు తెలిపారు. గత ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టి వర్షాల వల్ల వేరుశనగ, కంది ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తే వర్షాలు అధికంగా రావడంతో వేరుశనగ పొలాల్లోనే మొలకలు వచ్చి కుళ్లిపోయిన పరిస్థితి ఉందన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా కట్టాలో తెలియక దిక్కుతోచని పరిస్థితుల్లో రైతాంగం ఉందన్నారు. ఇన్సూరెన్స్ ఇచ్చి రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ప్రస్తుత ఖరీఫ్ పెట్టుబడులకు డబ్బులు లేక దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఉన్నారని తెలిపారు. అసలు, వడ్డీ కట్టి రుణాలు రెన్యూవల్ చేసుకోవాలంటే వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది న్నారు. కావున పంట రుణాలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెంచి మాన్యూవల్‌గా రెన్యువల్ చేయాల న్నారు. మార్టిగేజ్ లేకుండా రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వాలన్నారు. అడంగల్ లేకుండా 1బి ఆధారంగా రెన్యూవల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, బిహెచ్.రాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఆలం నరసానాయుడు

టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

నార్పల : మండలంలోని గడ్డంనాగేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త పెరవలి క్రిష్టయ్యకు ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు ఆర్థికసాయం అందజేశారు. కొద్ది రోజుల క్రితం ప్రమాదానికి గురై బెంగళూరులో చికిత్స పొందుతుండడంతో విషయం తెలుసుకున్న ఆలం ఆసుపత్రికి చేరుకుని రూ.20వేలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగన్న, వెంకటేశు, బోరు నాగార్జున, బాలయ్య, పెద్దవీరనారప్ప,ప్రసాద, రమేష్, స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహుడు, నల్లప్ప, శివయ్య, కిష్టయ్య, చిన్నపెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోక్షిత్ పాఠశాలలో సంబరాలు

అనంతపురం : స్థానిక విన్సెంట్ ఫెర్రర్‌నగర్‌లోని మోక్షిత్ పాఠశాలలో శుక్రవారం కాన్వకేషన్ డే సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి చదివిన చిన్నారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ పాఠశాల కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు. అలాగే చిన్న పిల్లలు రాబోయే రోజుల్లో అంచలంచెలుగా ఎదగాలని దానికి మోక్షిత్ స్కూల్ ఎంతగానో సహకరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.లక్ష్మీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో మోక్షిత్ పాఠశాల సిబ్బంది

24 గంటల్లోపే ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-నార్పల

ముఖ్యమంత్రి జగన్ నార్పల పర్యటనకు వచ్చి 24 గంటలు గడవక ముందే ఆర్థికసాయం కోసం విన్నవించుకున్న బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. రాజు, అరుణ కుమారుడు ధనుష్ జెనెటికల్ సమస్యలతో బాధపడుతూ ఈనెల 26న నార్పల పర్యటనకు వచ్చి సిఎం జగన్‌కు ఆర్థికసాయం అందజేయాలని విన్నవించుకున్నారు. అలాగే తన భర్త రంగారెడ్డి ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని భార్య యోగీశ్వరి సీఎం దృష్టికి తీసుకెళ్లింది. రామచంద్ర సోదరి భవాని కుమారుడు బాలచంద్ర (11) అంగవైకల్యంతో బాధపడుతున్నాడని ఆదుకోవాలని కోరడంతో కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం, వీల్ ఛైర్ అందజేశారు. అలాగే ఇటీవల జరిగిన కెమికల్ బ్లాస్ట్‌లో తన భర్తను కోల్పోయానని, ఇద్దరు చిన్న పిల్లలతో తన కుటుంబ పోషణ భారంగా మారిందని విన్నవించడంతో రూ.7 లక్షలు సాయం, జశ్వంత్ రెడ్డి (6) వైద్య పరీక్షల కోసం రూ.లక్ష అందజేశారు. అలాగే విద్యుత్‌శాఖలో టెంపరరీగా పనిచేస్తున్న తనకు విద్యుత్‌షాక్‌తో కుడిచేయి కోల్పోయానని వేడుకోవడంతో రూ.2 లక్షల ఆర్థికసాయం, విద్యుత్ శాఖలో షిఫ్ట్ అసిస్టెంట్‌గా కాంట్రాక్ట్ ఉద్యోగం ఇచ్చారు. అలాగే రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి, తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సిఎం దృష్టికి తీసుకురాగా రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. వీరితోపాటు వివిధ సమస్యలను విన్నవించుకున్న బాధితులందరికీ కలెక్టర్ ఎం.గౌతమి ఆర్థికసాయం అందజేశారు. దీంతో బాధితులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీగీతం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

ఇంటర్ మీడియట్ ఫలితాల్లో రాంనగర్‌లో 80 ఎనడై అడుగుల రోడ్డులో ఉన్న శ్రీగీతం జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మొదటి సంవత్సరం విద్యార్థి జి.నవీన్‌కుమార్ 450 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. అలాగే చందన కీర్తి, సాత్వికరెడ్డి 443, సాయిచరణ్ 440 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఫలితాల్లో తమ కళాశాల జిల్లాలో తృతీయ స్థానంలో నిలిచినట్లు కళాశాల చైర్మన్ మనీషానాయర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అభినందించారు.



శ్రీగీతం విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

పెన్న అహోబిలం ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను అధికారులు శుక్రవారం లెక్కించారు. ఆలయ ఇఒ విజయ్‌కుమార్, ఇన్స్‌పెక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆరు శాశ్వత హుండీలను లెక్కించగా 99 రోజులకు రూ.18.33 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ హనుమాన్ సేవాసమితి సభ్యులు, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఆలయ సిబ్బంది, మారుతీప్రసాద్, దీపక్, నరసింహులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి-గుత్తి

గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న ఈసిఈ, సిఎస్ సి, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ విద్యార్థులకు వీడ్కోలు సందర్భంగా చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చివరి సంవత్సరం విద్యార్థులు వారి జ్ఞాపకాలు, అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్‌రెడ్డి, వివిధ విభాగాల హెచ్ఒడిలు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

'శ్రీచైతన్య'లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం ఎపిపి-7 బ్రాంచిలో ప్రిన్సిపల్ పర్వీన్ ఆధ్వర్యంలో ప్రైమరీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి కావడానికి నిరంతరం కృషి చేసిన అధ్యాపక బృందం, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీన్ చంద్రమోహన్, ప్రైమరీ కోఆర్ ఇన్‌ఛార్జ్ పూజ, ప్రైమరీ ఇన్‌ఛార్జ్ మాధవి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జ్ కోమలి, ఇతర అధ్యాపక బృందాలు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆరాతీశారు. శుక్రవారం మండల పరిధిలోని ఎ.కొండాపురం గ్రామంలో పర్యటించి లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా,, లేదా,, అని ఆరా తీశారు. ఎవరైనా అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందకుంటే అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపిడిఒ యోగానందరెడ్డి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన రవికుమార్

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామం వద్ద 67వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయుడు మృతిచెందాడు. విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని గాజులపల్లి గ్రామానికి చెందిన రవికుమార్ (30) పట్టణంలోని శ్రీసాయి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. ఈనేపథ్యంలో విధులు ముగించుకుని 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని మనీష ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని వస్తుండగా కొత్తపేట గ్రామంలోని నాలుగు వరుసల రహదారి వంతెన వద్దకు రాగానే కర్నూలు నుంచి వస్తున్న ట్యాంకరు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఉపాధ్యాయుడు రవికుమార్ అక్కడికక్కడే మరణించాడు. మనీషకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే గాయపడ్డ విద్యార్థినికి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శిరీష కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈనేపథ్యంలో కడుపునొప్పి ఎక్కువ కావడంతో ఆ బాధను భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

స్నేక్ క్యాచర్‌కు పాముకాటు

గుత్తి : నివాసాల్లో సంచరించే పాములను ఎంతో చాకచక్యంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేసే ఓ స్నేక్ క్యాచర్ (పాములు పట్టే వ్యక్తి) శుక్రవారం పాముకాటుకు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని తురకపల్లి రోడ్డులో నివాసం ఉండే జేమ్స్ 40 ఏళ్లుగా నివాసాల్లో సంచరిస్తున్న పాములను పట్టుకుని అడవిలో వదిలేసేవారు. ఇందులో భాగంగానే స్థానిక లచ్చానుపల్లి రోడ్డులోని ఓ ఇంటిలో పాము ఉండడంతో సమాచారం తెలుసుకున్న జేమ్స్ అక్కడికి వెళ్లి పామును పట్టుకుంటుండగా అది తిరగబడి చేతికి కాటు వేసింది. దీంతో స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-పుట్లూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సిపిఐ నియోజకవర్గ నాయకులు పి.నారాయణస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఎం మండల కార్యదర్శి డి.పెద్దయ్య అధ్యక్షతన మండల కేంద్రంలో ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ఈనేపథ్యంలో ప్రతి వ్యక్తీ కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిడదీయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. లేకుంటే భవిష్యత్తు చీకటిమయం అవుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా మత విద్వేషాలను రెచ్చగొట్టడం బాధాకరమన్నారు. మరోవైపు అదానీ, అంబానీలకు దేశ సంపదను దోసిపెడుతోందన్నారు. కావున ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై బిజెపిని సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పిహెచ్ మండల కార్యదర్శి ఎ.రమేష్, బికెఎంయు మండల అధ్యక్షులు సి.పెద్దిరాజు, చేతివృత్తిదారుల సమైక్య మండల అధ్యక్షులు, సి.ఓబుళపతి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు వీరయ్య, శివ, రైతుసంఘం నాయకులు, పెద్ద కొండయ్య, మహిళా సమైక్య మండల కార్యదర్శి ఎ.శాంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

యాడికి వైద్యాధికారిగా శ్రీనివాసరెడ్డి

యాడికి : యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా వై.శ్రీనివాసరెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ ప్రావిన్ కుప్పంలో పీజీ చేయడానికి వెళ్లాడు. దీంతో వై.శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

ఫొటోగ్రాఫర్‌కు చేయూత

నార్పల : నిరుపేద కుటుంబానికి చెందిన బాధిత ఫొటోగ్రాఫర్ ఆదినారాయణకు మానవతావాది శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ శివకృష్ణచౌదరి శుక్రవారం రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. గతనెలలో కురిసిన భారీ వడగండల్ల వర్షానికి మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామానికి చెందిన ఫొటో గ్రాఫర్ ఆదినారాయణ ఇల్లు పూర్తిగా కూలిపోయింది. రెక్కడితేగానీ డొక్కాడని పరిస్థితిలో జీవనం సాగిస్తున్న ఆదినారాయణ కుటుంబ పరిస్థితిని గమనించిన ఫొటోగ్రాఫర్ల బృందం విషయాన్ని మానవతావాది శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు రామిరెడ్డి, సూర్యనారాయణ, విజయభాస్కర్, గణేష్, లోకేష్, విజయ్, బాషా, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.



ఫొటోగ్రాఫర్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

నార్పల ముతవల్లి నియామకం

ప్రజాశక్తి-నార్పల

నార్పల ముతవల్లిగా డిపో షంషుద్దీన్‌ను శుక్రవారం ఎన్నుకున్నారు. ముందుగా స్థానిక జామియా మసీదులో నమాజు చేసిన ముస్లిం సోదరులు అనంతరం సమావేశమై శంషుద్దీన్‌ను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని నాలుగు మసీదులకు ఈయన బాధ్యులుగా కొనసాగుతారు. ఈ సందర్భంగా శంషుద్దీన్ మాట్లాడుతూ తన ఎన్నికకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండల ముస్లిముల అభ్యున్నతికి, ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కాకా పలువురు ముస్లిములు శంషుద్దీన్‌కు అభినందనలు తెలిపారు. అలాగే హుస్సేన్ బాషను నెంబర్‌గా ఎన్నుకున్నారు.

3 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

మే 3 నుంచి 13వ తేదీ వరకూ పట్టణంలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు గౌని పాలాక్షి రెడ్డి, దేవాలయ కార్య నిర్వహణ అధికారి కె.నరసింహారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడో తేదీ బుధవారం కలశ స్థాపన, 4న ధ్వజారోహణ, సింహ వాహనోత్సవం, 5న సూర్యప్రభ, 6న శేష వాహనోత్సవం, 7న హనుమద్ వాహనోత్సవం, 8న ఉదయం శ్రీవారి కల్యాణోత్సవం, సాయంత్రం గరుడ వాహనోత్సవం, 9న గజేంద్ర వాహనోత్సవం, 10న ఉదయం మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మ రథోత్సవం, 11న పార్వేట, అశ్వ వాహనోత్సవం, బాణసంచా వేడుక, 12న వసంతోత్సవం, కంకణ విసర్జన, చక్రస్నానం, మయూర వాహనోత్సవం, 13న సప్త ప్రాకారోత్సవం, శయనోత్సవం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు బ్రహ్మోత్సవా ల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

చుక్కల భూమి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుత్తి

రైతులు సంబంధించిన చుక్కల భూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు పలుదురు రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ విమోచన సమితి కన్వీనర్ వై.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చుక్కల భూములను రైతులకు భూముల రిజిస్ట్రేషన్ చేయాలని ఇటీవల ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. దీంతో జిల్లాలో చాలామంది రైతులు చుక్కల భూములు సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చుక్కల భూములను రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు జ్ఞానేశ్వర్ రెడ్డి, కాశీరావు, సూర్యనారాయణ, శివయ్య, రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

యాడికి : మండల పరిధిలోని నిట్టూరు ప్రధాన రహదారిపై శుక్రవారం చోటు చేసుకున్న ప్రమాదంలో డ్రైవర్ రామదాసు గాయాలపాలయ్యాడు. రామదాసు గుత్తిలో నల్లబండలు దింపి తిరిగి తన ట్రాక్టర్‌లో స్వగ్రామం బెలుం బయలుదేరాడు. నిట్టూరు వంక బ్రిడ్జి లోకి ప్రవేశించగానే ఎదురుగా ఓ లారీ అడ్డు రావడంతో భీతిల్లిన రామదాసు ట్రాక్టర్‌ను పక్కకు తిప్పాడు. దీంతో ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు.